క్లుప్తంగా

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌కు సన్మానం


ఉమాశంకర్‌ను సన్మానిస్తున్న నాయకులు

తాండూరు రూరల్: తాండూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన వైస్ చైర్మన్‌గా నియమితులైన పటేల్ ఉమాశంకర్‌ను ఘనంగా సన్మానించారు. మండల పరిధి ఎల్మకన్నె గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం ఉమాశంకర్‌ను కలిసి శాలువా కప్పి, పూలమాలలతో సన్మానించారు. ఇందులో నాయకులు ఆకుల జగదీశ్వర్, కమ్మరి శివ రాజ్, కృష్ణకుమార్, బొయిని రాజు, నర్సింహులు, అబ్దుల్ ఉన్నారు.

ఓటమి భయంతోనే విమర్శ


గ్రామ కమిటీతో నాయకులు జనార్దన్‌రెడ్డి, నాగప్ప తదితరులు

తాండూరు రూరల్: ఓటమి భయంతోనే కాంగ్రెస్ పార్టీని ఎమ్మెల్యే రోహిత్‌రెడ్డి విమర్శిస్తున్నారని పార్టీ మండల అధ్యక్షుడు జెన్నె నాగప్ప, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మల్కాపూర్ జనార్దన్‌రెడ్డిలు ఆరోపించారు. శుక్రవారం మండల పరిధి చెన్‌గేస్‌పూర్ గ్రామంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. అనంతరం వారు మాట్లాడారు. తల్లిలాంటి కాంగ్రెస్‌ను మోసం చేసిన వ్యక్తి రోహిత్‌రెడ్డి అని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ఆయనకు ఓటమి తప్పదన్నారు. ఇందులో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీష్ ఉన్నారు.

ముగిసిన చండీ యాగం


పూజలు చేస్తున్న తిరుపతిరెడ్డి దంపతులు

కొడంగల్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ నివాసంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమాలు.. శుక్రవారం నిర్వహించిన చండీ హోమంతో ముగిశాయి. 21 మంది అర్చకులు హోమం నిర్వహించారు. మహాలక్ష్మి, మహాకాళి హోమాలు, సుహాసిని పూజ, అమ్మవారికి పుష్పార్చన, మహా పూర్ణాహుతి తదితర పూజలు చేశారు. పూజలో రేవంత్ సోదరుడు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి తిరుపతిరెడ్డి దంపతులు పాల్గొన్నారు. హోమంలో రేవంత్‌రెడ్డి దంపతులు, కూతురు అల్లుడు పాల్గొని పూజలు జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. ఉత్సవానికి కాంగ్రెస్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు రేవంత్ అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో అల్పాహారం హర్షణీయం

క్రమం తప్పకుండా పిల్లలను బడికి పంపాలి: కౌన్సిలర్


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కౌన్సిలర్

తాండూరు టౌన్: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అల్పాహారం అందించాలనే ప్రభుత్వ ఆలోచన హర్షణీయమని 20వ వార్డు కౌన్సిలర్ సంగీతాఠాకూర్ అన్నారు. శుక్రవారం విద్యాలయంలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు ఉదయం అల్పాహారం అందించడం వలన ఇంటివద్ద తల్లులకు కొంచెం శ్రమ తగ్గించినట్లవుతుందని పేర్కొన్నారు. అలాగే డ్రాపవుట్స్ సంఖ్య తగ్గుతుందన్నారు. విద్యార్థులపై ఉపాధ్యాయులకు ఎంత బాధ్యత ఉందో.. పిల్లల పట్ల తల్లిదండ్రులకు అంతే బాధ్యత ఉందని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. క్రమం తప్పకుండా వారిని పాఠశాలకు పంపించాలని చెప్పారు. ఈ సందర్భంగా సెప్టెంబర్ 5న ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులను సన్మానించారు. ఇందులో ప్రధానోపాధ్యాయురాలు మాధవి, ఉపాధ్యాయురాలు రాణి, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వ్యక్తిగత పరిశుభ్రత అవసరం

పెద్దేముల్: సీజనల్ వ్యాధుల కాలంలో పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రత పాటించాలని సర్పంచ్ వీరప్ప సూచించారు. శుక్రవారం గాజీపూర్‌లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ బుచ్చిబాబు కలిసి ఆయన ప్రారంభించారు. శిబిరంలో పలువురికి వైద్య చికిత్సలు చేశారు. అనంతరం ఆరోగ్య జాగ్రత్తలు సూచించి మాట్లాడారు. జ్వరాల బారిన పడకుండా ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. ఎంఎల్‌ఎస్‌పీలు రసూల్, ఎంపీహెచ్ఏ మేల్ హరిశంకర్, ఏఎన్ఎం నర్సుబాయి, ఆశ వర్కర్లు చంద్రకళ, లక్ష్మీ, నర్సమ్మ, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం ప్రశ్నార్థకం

- పల్లెల్లో లోపించిన పారిశుద్ధ్యం
- పేరుకుపోతున్న చెత్తాచెదారం
- మురుగు కాలువలు లేక రోడ్లపై పారుతున్న మురుగు
- వ్యక్తిగత మరుగుదొడ్లకు నోచుకోని ప్రజలు
- వీధి దీపాలు లేక చీకట్లో మగ్గుతున్న గ్రామాలు

సాక్షి విజిట్

వర్షాకాలం. ఆపై సీజనల్ వ్యాధుల కాలం.. ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తుండగా.. లోపించిన పారిశుద్ధ్యంతో ఈగలు, దోమలు పెరిగి ప్రజారోగ్యాన్ని ప్రశ్నార్థకంగా మారుస్తున్నాయి. వరుస వర్షాలతో నిలిచిన నీరు, మురుగు కాలువలు లేక రోడ్లపై పారుతున్న మురుగు, ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్త కుప్పలతో పల్లె ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. విష జ్వరాల బారిన పడి ఆసుపత్రుల పాలవుతున్న నేపథ్యంలో 'సాక్షి' మున్సిపాలిటీ పరిసర గ్రామాలు, ఆసుపత్రులను విజిట్ చేయగా.. పుర'గతి' వెలుగుచూసింది.


బూల్కాపూర్‌లో అంతర్గత రోడ్డు దుస్థితి

కొడంగల్: మున్సిపల్ పరిధి గ్రామాలు అభివృద్ధికి ఆమడ దూరాన ఉన్నాయి. కనీస అవసరాలకు నోచుకోని దుస్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. అపరిశుభ్రతతో అల్లాడిపోతున్నాయి. మురుగు కాలువలు లేక.. చెత్తాచెదారం పేరుకుపోయి తీవ్ర దుర్గంధం వెదజల్లుతోంది. మోరీలు లేక మురుగు జలాల నిల్వతో ఏర్పడిన గుంతలు దోమలకు ఆవాసంగా మారాయి. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అసలే వ్యాధుల కాలం.. ఆపై లోపించిన పారిశుద్ధ్యంతో రోగాల పాలవుతున్నామని వాపోతున్నారు. ఇక అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చినుకు పడితే చిత్తడిగా మారి.. కాలి నడకకూ కష్టంగానే ఉందని ఆవేదన చెందుతున్నారు.

వేధిస్తున్న నిధుల కొరత!

కొడంగల్‌లో బూల్కాపూర్, ఐనన్‌పల్లి, పాత కొడంగల్, గుండ్లకుంట, పాత కొడంగల్ తండా, కొండారెడ్డిపల్లి గ్రామాలను కలిపి మున్సిపాలిటీని ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన పురపాలికలో నిధుల కొరత కారణంగా గ్రామాల్లో సీసీరోడ్ల నిర్మాణం, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టడానికి తీవ్ర జాప్యం జరుగుతోంది. బూల్కాపూర్ గ్రామంలో ఇప్పటి వరకు వీధి స్తంభాలు ఏర్పాటు చేయలేదు. పట్టణ ప్రగతి పేరుతో పాలన గొప్పగా సాగుతున్నట్లు ప్రచారం జరుగుతున్నప్పటికీ.. క్షేత్రస్థాయిలో అది అమలు కావడం లేదు. కొత్త మున్సిపల్ చట్టం ప్రకారం ఇంటింటికీ వెళ్లి చెత్త సేకరించాలి. నిత్యం తడి, పొడి చెత్తను వేర్వేరుగా నివాసాల నుంచి తీసుకోవాలి. కానీ ఇక్కడ అందుకు భిన్నంగా ఉంది. కొడంగల్ పట్టణం పలు కాలనీలతో పాటు గ్రామాల్లో చెత్త సేకరణకు వాహనాల కొరత తీవ్రంగా ఉంది. దీంతో చెత్త సేకరణతో పాటు, పారిశుద్ధ్య పనులకు ఆటంకంగా మారింది. బూల్కాపూర్, ఐనన్‌పల్లి, పాత కొడంగల్‌లో మురుగు కాల్వలు లేవని గ్రామస్తులు చెప్పారు.

కనిపించని స్వచ్ఛ భారత్

బూల్కాపూర్, ఐనన్‌పల్లి రెండు గ్రామాల్లో సుమారు రెండు వేలకు పైగా జనాభా ఉంది. 1,200 పైగా ఓటర్లు ఉన్నారు. ఈ పల్లెలకు వెళ్లాలంటే మట్టి రోడ్డే దిక్కు. ఇక బూల్కాపూర్‌లో మురుగు కాల్వలు, వ్యక్తిగత మరుగుదొడ్లు లేవు. స్వచ్ఛ భారత్ మచ్చుకైనా కనిపించదు. పారిశుద్ధ పనులు పడకేశాయని, చెత్త సేకరణకు వాహనాలు వీధుల్లోకి రావడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

ఊపిరి ఆడటం లేదు..



బూల్కాపూర్‌లో మురుగు కాల్వలు నిర్మించాలి. మోరీలు లేకపోవడం వలన మురుగు రోడ్లపై పారుతోంది. దోమల బెడద పెరిగింది. పెంట కుప్పలు పేరుకుపోయాయి. తీవ్రమైన దుర్గంధంతో ఊపిరి ఆడటం లేదు. దారి పొడవునా స్తంభాలు లేవు. వీధి దీపాలు లేక గ్రామం అంధకారంలో మగ్గుతోంది.

– నర్సింహులు, బూల్కాపూర్

రోడ్డు వేయాలి



మున్సిపల్ పరిధి బూల్కాపూర్ గ్రామానికి బీటీరోడ్డు వేయాలి. మట్టి రోడ్డుపై గుంతలు ఏర్పడి రాకపోలకు ఇబ్బందిగా ఉంది. మురుగు కాల్వలు నిర్మించాలి. అంతర్గత రోడ్లు వేయాలి. మెయిన్ రోడ్డు నుంచి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలి.

– ఆంజనేయులు, బూల్కాపూర్

రెండేళ్ల క్రితం ఫాగింగ్!

మున్సిపల్ పరిధి గ్రామాల్లో దోమల బెడద పెరిగింది. శానిటేషన్ సిబ్బంది ఫాగింగ్ (రసాయన మందు పిచికారీ) చేస్తే కొంత మేరకు దోమలు తగ్గుతాయి. కొడంగల్‌లో రెండేళ్ల క్రితం ఒకసారి ఫాగింగ్ చేశారని, మళ్లీ ఇప్పటి వరకు ఆ దిశగా చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రభుత్వం కోట్లాది రూపాయలు మంజూరు చేస్తుందని, మరి సమస్యలు ఎందుకు పరిష్కారం కావడం లేదని పుర ప్రజలు ప్రశ్నిస్తున్నారు. పారిశుద్ధ్య లోపంతో డెంగీ, మలేరియా తదితర విషజ్వరాల బారిన పడుతున్నామని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు అందుబాటులో లేక వైద్యం అందడం లేదని రోగులు ఆరోపిస్తున్నారు. వైద్యులు వంతుల వారీగా విధులు నిర్వహిస్తున్నారనే అపవాదు లేకపోలేదు.


ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స కోసం వచ్చిన రోగులు

నేడు సర్వసభ్య సమావేశం

ధారూరు: ధారూరు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం 12.05 గంటలకు సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ సత్యనారాయణరెడ్డి, సీఈఓ నర్సింహులు సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. సమీక్షకు సంఘం డైరెక్టర్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు, రైతులు హాజరుకావాలని కోరారు.

మర్పల్లిలో..

మర్పల్లి: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీపీ లలిత ఒక ప్రకటనలో తెలిపారు. సమీక్షకు ఎమ్మెల్యే ఆనంద్, జెడ్పీటీసీ మధుకర్ హాజరుకానున్నారని తెలిపారు. సమీక్షకు సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

వికారాబాద్‌లో 3న

అనంతగిరి: అక్టోబర్3న వికారాబాద్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సత్తయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మంగళవారం ఉదయం 11 గంటలకు ఎంపీపీ చంద్రకళ అధ్యక్షతన సమీక్ష జరగనుందని, ఎంపీటీసీలు, సర్పంచులు కోఆప్షన్ సభ్యులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

అవినీతి అంతం.. మోదీకే సాధ్యం

కుల్కచర్ల: రాష్ట్రంలో జరుగుతున్న అవినీతి పాలన అంతం కావాలంటే ఒక్క మోదీకే సాధ్యమవుతుందని, బీజేపీకి అవకాశం ఇవ్వాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. అక్టోబర్ 1న పాలమూరు జిల్లాలో నిర్వహించనున్న మోదీ బహిరంగ సభకు బీజేపీ శ్రేణులు భారీగా తరలిరావాలని కోరారు.

విజయవంతం చేయండి

దోమ: 1వ తేదీన మహబూబ్‌నగర్ జిల్లాలో నిర్వహించే బీజేపీ బహిరంగసభను పార్టీ కార్యకర్తలు, ప్రజలు విజయవంతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కిసాన్‌మోర్చా ఉపాధ్యక్షుడు మారుతికిరణ్ బూనేటి కోరారు. దోమ మండల కేంద్రంలో పార్టీ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీజేపీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. సభకు ప్రధాని మోదీ హాజరవుతున్నారని తెలిపారు. ఇందులో పార్టీ మండల అధ్యక్షుడు శేరిరాం రెడ్డి ఉన్నారు.

సమస్యలు పట్టని ప్రభుత్వం


తాండూరు రూరల్: సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న అంగన్‌వాడీలు

- గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్

పరిగి: అంగన్‌వాడీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌నాయక్ డిమాండ్ చేశారు. పట్టణకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరవధిక సమ్మెకు శుక్రవారం విద్యార్థి సంఘంతో పాటు, ప్రజా సంఘాల నాయకులు మద్దతు తెలిపి మాట్లాడారు. ఎన్నికల సమయంలో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ ఉద్యోగులంటూ ఉండరని చెప్పిన సీఎం కేసీఆర్.. ఇప్పుడు ఉద్యోగులు సమ్మె చేస్తున్నా పట్టించుకోవటం లేదని ఆరోపించారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీలను క్రమబద్ధీకరించడంతో పాటు, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. పీఎస్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, జీవీఎస్ నాయకులు అంబర్‌సింగ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

తాండూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని 19 రోజులుగా సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవటం లేదని అంగన్‌వాడీలు మండిపడ్డారు. ఈ సందర్భంగా టీచర్లు, హెల్పర్లు ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించేంత వరకు పోరాటం ఆగదన్నారు. సమ్మెకు సీఐటీయూ జిల్లా నాయకులు శ్రీనివాస్, కౌన్సిలర్ సోమశేఖర్, కాంగ్రెస్ నాయకులు ప్రభాకర్‌గౌడ్, సంతోష్ మద్దతు తెలిపారు.

క్రమబద్ధీకరించాలి..

అనంతగిరి: ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు చేస్తున్న నిరవధిక సమ్మె 19వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వం ఇప్పటికైనా తమను క్రమబద్ధీకరించి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు.

డిమాండ్ల సాధనకు పోరాటం తప్పదు


కుల్కచర్ల: వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీరేశ్

- ముదిరాజ్‌లందరూ సంఘటితం కావాలి
- ముదిరాజ్ మహాసభ రాష్ట్ర నేత వీరేశ్ ముదిరాజ్

కుల్కచర్ల: డిమాండ్ల సాధనకు పోరాటం చేయక తప్పేటట్లు లేదని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు కాసాని వీరేశ్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో పండుగల సాయన్న విగ్రహ ఆవిష్కరణ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. జనభా దామాషా ప్రకారం ముదిరాజ్ ప్రజలకు దక్కాల్సిన అవకాశాలను పొందేందుకు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. జనాభాను బట్టి పథకాలు, సామాజిక, రాజకీయ అవకాశాలను కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలకు ఉన్నా.. పట్టించుకోవటం లేదని ఆరోపించారు. అక్టోబర్ 1న పరిగి పట్టణంలో నిర్వహించనున్న సాయన్న విగ్రహావిష్కరణకు ముదిరాజులు భారీగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల ముకుందం, నియోజకవర్గ అధ్యక్షుడు రామస్వామి, సంఘం మండల అధ్యక్షుడు చంద్రలింగం, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సాయన్న, నాయకులు కాటనిపల్లి అంజిలయ్య, మైపాల్, శ్రీను, రాములు, నాయకులు పాల్గొన్నారు.

1న సాయన్న విగ్రహావిష్కరణ

దోమ: పరిగి పట్టణంలో ఏర్పాటు చేస్తున్న పోరాట యోధుడు పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు దోమ మండల కేంద్రంలో విగ్రహావిష్కరణ వాల్‌పోస్టర్ ఆవిష్కరించి మాట్లాడారు. సాయన్న విగ్రహాన్ని అక్టోబర్ 1న పరిగిలో ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. ఇందులో ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు, ప్రధానకార్యదర్శి చందు ఉన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించండి

- స్కీంను అక్షయపాత్రకు కట్టబెట్టే యత్నం విరమించుకోవాలి
- మధ్యాహ్న భోజన కార్మికుల డిమాండ్


కార్యాలయ సిబ్బంది వెంకటయ్యకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికుల సంఘం సభ్యులు

కొడంగల్ రూరల్: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ ఆధ్వర్యంలో వంట ఏజెన్సీ మహిళలు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని విద్యా వనరుల కేంద్రం ఆవరణలో నిరసన వ్యక్తంచేసి మాట్లాడారు. భోజన కార్మికులకు పెంచిన వేతనాలు, కొత్త మెనూకు బడ్జెట్‌ను కేటాయించాలని, పెండింగ్ బిల్లులు ఇవ్వాలని కోరారు. పథక నిర్వహణను అక్షయపాత్రకు అప్పగించే ప్రయత్నం విరమించుకోవాలని, స్కీం కార్మికులకు అదనంగా రూ.2 వేలు ఇస్తామన్న ముఖ్యమంత్రి ప్రకటన అమలు చేయాలని కోరారు. గుడ్లకు అదనంగా బడ్జెట్‌ను కేటాయించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్యాస్ సిలిండర్లకు పూర్తి సబ్సిడీ అందించాలని పేర్కొన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంఈఓ కార్యాలయ సిబ్బంది వెంకటయ్యకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి బుస్స చంద్రయ్య, మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం నియోజకవర్గ అధ్యక్షురాలు లక్ష్మి, సభ్యులు ఆశమ్మ, పద్మ, అంజమ్మ, భారతమ్మ, మణెమ్మ, రుక్కమ్మ పాల్గొన్నారు.

చెరువు కట్టపై మట్టిరోడ్డు

మోమిన్‌పేట: అయిమ చెరువు కట్టపై శుక్రవారం మట్టి రోడ్డు వేశారు. మండల పరిధి టేకులపల్లి గ్రామ అయిమ చెరువు కట్టపై రైతులు వ్యవసాయ పొలాలకు రాకపోకలు సాగిస్తుంటారు. ఇటీవల కురిసిన వర్షాలతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. దీంతో సర్పంచ్ నవనీత దృష్టికి రైతులు తీసుకురాగా.. వెంటనే మొరంతో రోడ్డు వేయించారు.

'గ్యారంటీ'గా ఆరు పథకాలు అమలు

నాటి అభివృద్ధి పనులే నేటికి దర్పణం: అనన్య


గ్యారంటీ స్కీంలను ప్రజలకు వివరిస్తున్న అనన్య

బంట్వారం: రానున్న ఎన్నికల్లో మా నాన్నను భారీ మెజార్టీతో గెలిపించాలని మాజీ మంత్రి గడ్డం ప్రసాద్‌కుమార్ కూతురు అనన్య ప్రజలను కోరారు. శుక్రవారం ఆమె మండల పరిధి సుల్తాన్‌పూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రసాద్‌కుమార్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులే తప్పా.. కొత్తగా ఏమీ జరగ లేదన్నారు. నాడు వేసిన రోడ్లపై నేటి పాలకులు తట్టెడు మట్టి కూడా వేయకపోవడం విచాకరమన్నారు. నిత్యం ప్రజల్లో ఉండే మా నాన్నను దీవించాలన్నారు. అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ స్కీంలు తప్పక అమలవుతాయని చెప్పారు.

ఏడాది గడిచినా పూర్తికాని రోడ్డు

- అభివృద్ధి పనులపై పట్టింపులేని ప్రభుత్వం
- నిరసన వ్యక్తం చేసిన బీజేపీ నాయకులు

కుల్కచర్ల: సంవత్సరాలు గడుస్తున్నా రోడ్డు పనులు పూర్తిచేయకపోవటం ఎంతవరకు సబబని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఘణపురం వెంకటయ్య ప్రశ్నించారు. రోడ్డు పనుల అలసత్వంపై శుక్రవారం నిర్వహించిన రాస్తారోకోలో ఆయన మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో కొనసాగుతున్న అభివృద్ధి పనులపై ప్రభుత్వానికి, అధికారులకు చిత్తశుద్ధి లేదని ఆరోపించారు. కిలో మీటరు రోడ్డు పనులు పూర్తిచేయడానికి సంవత్సరం కాలం పట్టడం హాస్యస్పదమన్నారు. సీసీరోడ్డు పనులు సగమే పూర్తి చేయడం వలన కంకర తేలి ఉన్న రహదారిపై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెప్పారు. సంబంధిత అధికారులు త్వరితగతిన రోడ్డును పూర్తిచేయని పక్షంలో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఇందులో పార్టీ జిల్లా నాయకులు రాము యాదవ్, మండల అధ్యక్షుడు మైపాల్ ముదిరాజ్, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, మాజీ సర్పంచ్ జానకిరాం, ఓబీసీ మోర్చ మండల అధ్యక్షుడు వెంకటయ్య, మండల ఉపాధ్యక్షుడు కొండ ఆంజనేయులు, రాజేశ్వర్, రమేష్, శేఖర్ పాల్గొన్నారు.

ఆరోగ్యం కాపాడుకోవాలి

కుల్కచర్ల: ప్రతిఒక్కరూ వ్యక్తిగత ఆరోగ్యంపై దృష్టి సారించాలని కుల్కచర్ల మండల వైద్యాధికారి మాధురి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చిన రోగులకు బీపీ, షుగర్, గుండె సంబంధిత వ్యాధుల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. దురలవాట్లతో యువత అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకొని, ఆరోగ్యం కాపాడుకోవాలని సూచించారు. ఇందులో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ చంద్రప్రకాష్, వైద్య సిబ్బంది రత్నలత, యాదమ్మ, సుజాత, రత్నమ్మ, జంగయ్య, జ్యోతి, గౌరీ ఉన్నారు.

కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే.. స్వచ్ఛత


మున్సిపల్ సిబ్బందికి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది. చిత్రంలో మున్సిపల్ చైర్‌పర్సన్, కౌన్సిలర్లు

- వైద్య శిబిరం ఏర్పాటు అభినందనీయం
- మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న

తాండూరు టౌన్: 'పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది ఆరోగ్యంగా ఉంటేనే ఊరువాడా స్వచ్ఛతగా ఉంటుంది. ప్రజారోగ్యం బాగుంటుంది. వారి ఆరోగ్య పరిరక్షణకు మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపాలి' అని మున్సిపల్ చైర్ పర్సన్ స్వప్న అన్నారు. శుక్రవారం స్వచ్ఛత హి సేవా కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో డాక్టర్ హరీశ్ బృందం ఆధ్వర్యంలో 152 మంది పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడారు. నిత్యం చెత్తా చెదారంలో పనిచేసే కార్మికులు, ఉద్యోగుల ఆరోగ్యం గురించి ఆలోచించడం, బీమా సౌకర్యం తదితర వాటిపై కమిషనర్ శ్రద్ధ చూపడం అభినందనీయమన్నారు. వైస్ చైర్‌పర్సన్ దీప మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు, సిబ్బందికి ప్రతి నెలా వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వారి ఆరోగ్య విషయాలు తెలుసుకోవాలని కోరారు. ఇందులో కమిషనర్ షఫీవుల్లా, కౌన్సిలర్లు నీరజ, రత్నమాల, సంగీత, ముక్తార్‌నాజ్, మేనేజర్ నరేందర్ రెడ్డి, డీఈఈ ఖాజ హుస్సేన్, ఈఈ ప్రవీణ్‌గౌడ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు వెంకటయ్య, కిష్టయ్య ఉన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోండి

పరిగి: ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ అరవింద్‌రావు, మున్సిపల్ చైర్మన్ ముకంద అశోక్‌కుమార్‌లు అన్నారు. శుక్రవారం పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శ్రీసాయి దంతవైద్యశాల ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించగా.. 140 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం వారు మాట్లాడారు. దంత సమస్యలు ఉన్నవారు మెరుగైన చికిత్స చేసుకోవాలంటే వైద్యశాలలో ఉచితంగా నిర్వహిస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్, సీనియర్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, ఎంపీడీఓ శేషగిరిశర్మ, ఎంపీఓ దయానంద్, వైద్యులు నిహారిక, విశ్వన్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

భైభై వినాయక

కనుల పండువగా నిమజ్జనోత్సవం

బొంరాస్‌పేట/ కొడంగల్ రూరల్: చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా నిత్యపూజలందుకున్న గణపయ్యను భైభై వినాయక అంటూ శుక్రవారం గంగమ్మ ఒడికి చేర్చారు. 12వ రోజు సందర్భంగా మండపాల వద్ద ప్రత్యేకలు నిర్వహించారు. అన్నదానం చేశారు. అనంతరం స్వామివారి చేతిలోని లడ్డూను వేలం వేయగా.. భక్తులు పోటీ పడి రూ.వేలు, లక్షలు వెచ్చించి ప్రసాదాన్ని సొంతం చేసుకున్నారు. సాయంకాలం అలంకరించిన భారీ వాహనాల్లో లంబోదరున్ని ప్రతిష్ఠించి శోభాయాత్రంగా ఆటపాటలతో వెళ్లిరా వినాయకా అంటూ నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటుచేసి పర్యవేక్షించారు.


కొడంగల్ రూరల్: క్రేన్ సహాయంతో గణనాథుల నిమజ్జనం


కొడంగల్ రూరల్: వడ్డర్‌గల్లీ వినాయక విగ్రహ ఊరేగింపులో భక్తుల ఆటాపాట


బొంరాస్‌పేట: మండల కేంద్రంలో భజనకీర్తలతో శోభాయాత్ర